ప్రజా సేవకులకు సత్కారం

- ప్రభుత్వ పని తీరుకు వన్నె తెచ్చిన వలంటీర్లు
- కొవ్వూరు డివిజన్‌లో 3,060 మంది వలంటీర్లకు పురస్కారాలు

నిడదవోలు రూరల్: పేదల కన్నీళ్లు తుడిచి సంక్షేమాన్ని ప్రతి ఇంటి ముంగిటకూ తీసుకొచ్చారు. నిస్సహాయ స్థితిలో ఉన్న అవ్వాతాతలకు ప్రతి నెలా ఒకటో తేదీన తలుపు తట్టి పింఛన్లు అందిస్తూ వలంటీర్లు కొత్త ఒరవడి సృష్టించారు. అలాంటి వలంటీర్ల సేవలకు గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తమ పురస్కారాలతో సత్కరిస్తోంది. వలంటీర్‌గా బాధ్యతలు తీసుకున్న వారంతా యువ సైనికుల్లా, సేవా వారధుల్లా నూతనోత్సాహంతో ముందుకు సాగుతున్నారు. గ్రామ వలంటీర్లు ఎప్పటికప్పుడు తమకు కేటాయించిన 50 కుటుంబాలను కలుస్తూ వారి అవసరాలు తెలుసుకుంటున్నారు. పింఛన్లతో పాటు అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ , వైఎస్సార్ భరోసా, డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా, నాయీబ్రాహ్మణులు, దర్జీలు, రజకులకు ఆర్థిక సహాయం, వైఎస్సార్ చేయూత, రైతు భరోసా, ఇళ్లస్థలాల పంపిణీ, పింఛన్ల ఇలా ఏ పథకానికి అర్హులో గుర్తించి లబ్ధిదారుల వివరాలతో గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేయిస్తున్నారు. కోవిడ్ విధుల్లో బాధ్యతగా పనిచేయడంతో దేశ వ్యాప్తంగా వలంటీర్ల వ్యవస్థకే పేరు తీసుకొచ్చారు. దీంతో గత మూడేళ్లగా సంక్షేమ పథకాలను అర్హులకు చేరుస్తున్న వలంటీర్ల సేవలకు మెచ్చి ప్రభుత్వం ప్రతి పురస్కారాలు అందిస్తోంది. సేవా వజ్రకు రూ.30 వేలు, సేవారత్నకు రూ.20 వేలు, సేవా మిత్రకు రూ.10 వేల చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేయడంతో పాటు వలంటీర్లకు బ్యాడ్జీ అందజేసి శాలువాతో సత్కరిస్తున్నారు.

సేవలే అర్హతగా పురస్కారాలు..

వలంటీర్లకు ఇచ్చే అవార్డులో సేవా వజ్ర అంటే విధి నిర్వహణలో 95 నుంచి 100 శాతం మధ్యలో చేసిన సేవల ఆధారంగా మార్కులు కేటాయిస్తారు. లబ్ధిదారుడు పథకానికి అర్హుడై ఉంటే అన్ని రకాల ధ్రువ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించి, నిర్దిష్ట సమయంలో జాప్యం లేకుండా సకాలంలో సంక్షేమ పథకాలు అందించిన వారికి సేవా వజ్ర అవార్డుకి ఎంపిక చేశారు. నియోజకవర్గ పరిధిలోని నిడదవోలు పట్టణంలో షేక్ షర్మీలా, ఎ.చంద్రశేఖర్, కోరుమామిడికి చెందిన జొన్నకూటి కవిత, ఉండ్రాజవరం మండలం దమ్మెన్నుకు చెందిన బొక్కా వెంకటసాయికృష్ణ, వడ్లూరుకు చెందిన పి.కల్యాణి వజ్ర అవార్డుకు ఎంపికయ్యారు. వీరికి రూ.30 వేల నగదు, ప్రశంసా పత్రం, బ్యాడ్జి, శాలువా బహూకరిస్తారు. నిడదవోలు నియోజకవర్గంలో ఈనెల 25 నుంచి ప్రతి సచివాలయ పరిధిలోని వలంటీర్లకు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా సేవా పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.



నిడదవోలులో వలంటీర్లకు సేవా పురస్కారాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, అధికారులు (ఫైల్)



కాకినాడ జీజీహెచ్‌లో చిన్నారి తల్లి సూర్యకుమారికి నగదు అందిస్తున్న శెట్టిపేట వలంటీర్ ప్రియాంక (ఫైల్)

కొవ్వూరు డివిజన్‌లో మండలాల వారీగా వలంటీర్ల పురస్కారాల వివరాలు

మండలం	సేవా వజ్ర	సేవారత్న	సేవామిత్ర
చాగల్లు	2	5	248
దేవరపల్లి	2	5	293
గోపాలపురం	1	5	237
కొవ్వూరు మండలం	2	5	265
కొవ్వూరు పట్టణం	0	5	215
నల్లజర్ల	0	5	336
నిడదవోలు మండలం	1	5	300
నిడదవోలు పట్టణం	2	5	192
పెరవలి	0	5	373
తాళ్లపూడి	1	5	204
ఉండ్రాజవరం	2	5	329
మొత్తం	13	55	3060

బాధ్యత పెరిగింది



వలంటీర్లకు పురస్కారాలు అందించడంతో మా బాధ్యత మరింత పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను సైతం వలంటీర్లుగా తీసుకుని మాకు సమాజంలో ప్రత్యేక గౌరవాన్ని కల్పించింది. నా పరిధిలోని 74 కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందించడం నాకు ఎంతో సంతృప్తి ఇచ్చింది. చిత్తశుద్ధితో పనిచేస్తున్న మమ్మల్ని గుర్తించి అవార్డులు ఇచ్చిన ప్రోత్సహించడం మంచి పరిణామం. సేవావజ్ర అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉంది.

– జొన్నకూటి కవిత, సేవావజ్ర వలంటీర్, కోరుమామిడి

మేమూ ప్రభుత్వ బలగమే



వలంటీర్లు అందరూ ప్రజల పక్షమే. మేమంతా ప్రభుత్వ బలగమే. ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. నా క్లస్టర్ పరిధిలో రెండేళ్ల చిన్నారి చెట్టే డయానా శాంతి స్పైనల్ మస్క్యులర్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతోంది. వైద్యం చేయించాలంటే రూ.16 కోట్లు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. ఈ ఏడాది జనవరి 3న రాజమహేంద్రవరం వచ్చిన సీఎం జగనన్న బస్సును ఆపి పాప వ్యాధి గురించి నేను కూడా కలిసి చెప్పాను. దీంతో వెంటనే పాపకు రూ.5 వేల పింఛన్‌తో పాటు తల్లి సూర్యకుమారికి ఉద్యోగం మంజూరు చేశారు. నా జీవితంలో ఎప్పటికి మరిచిపోలేని సంఘటన.

– యల్లమెల్లి ప్రియాంక, వలంటీర్, శెట్టిపేట

వలంటీర్లతో సంక్షేమం డోర్ డెలివరీ



ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను డోర్ డెలివరీ చేస్తున్నాం. కరోనా వంటి విపత్కర సమయంలోనూ వలంటీర్లంతా సైనికుల్లా పనిచేసి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు కృషి చేశారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి. కులమతాలు, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు.

– జి.శ్రీనివాస్‌నాయుడు, ఎమ్మెల్యే, నిడదవోలు

క్లుప్తంగా

అనాథలకు అన్నదానం



వృద్ధురాలికి అన్నదానం చేస్తున్న కప్పల వరలక్ష్మి

గోపాలపురం: వృద్ధులు, వికలాంగులు, అనాథలకు శాఫ్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి ఆదివారం సాయంత్ర గోపాలపురం, పెద్దగూడెంలోని తన ఇంటి వద్ద అన్నసమారాధన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తల్లి పాపారత్నం జ్ఞాపకార్థం నాలుగేళ్లగా ప్రతి ఆదివారం సుమారు 35 మంది అనాథలకు బోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

అందరి సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



విలేకరులతో మాట్లాడుతున్న రాజీవ్‌కృష్ణ

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు రాజీవ్‌కృష్ణ

చాగల్లు: అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు (పెట్టుబడులు, మౌలిక వసతులు) రాజీవ్‌కృష్ణ అన్నారు. ఊనగట్ల గ్రామంలోని గోగులమ్మ వారి జాతరకు ఆదివారం ఆయన విచ్చేశారు.ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుల నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో, చిత్తశుద్ధితో పనిచేసి రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని అన్నారు. అగ్ర వర్ణాల పేదలకు కూడా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదే అన్నారు. కార్యక్రమంలో నిడదవోలు, చాగల్లు జెడ్పీటీసీ సభ్యులు కొయ్యే సూరిబాబు, గారపాటి విజయదుర్గ, చాగల్లు, కొవ్వూరు ఎంపీపీలు మట్టా వీరాస్వామి, కాకర్ల నారాయుడు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వాలీబాల్ పోటీలు

గోపాలపురం: స్థానిక పెద్దగూడెంలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మారక జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. క్రీడాకారులను ఉద్దేశించి కొవ్వూరు ఫారెస్ట్ సెక్షన్ అధికారి దాసరి రాజేష్ ఆదివారం మాట్లాడారు. వాలీబాల్ పోటీల ప్రథమ బహుమతి విజేత జట్టును తాను రూ.15 వేల నగదు అందిస్తానని ప్రకటించారు. శాఫ్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, దాసరి కుటుంబరావు, వింజమూరి సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యురాలు వార సంగీత, భేతాళ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి నివాళి

కొవ్వూరు: ఆదివారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా దొమ్మేరు గ్రామంలో ఏఐసీసీ సభ్యురాలు ఎండీ అమర్‌జహేబేగ్ ఆధ్వర్యంలో రాజీవ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.74వ రాజ్యాంగ సవరణ ద్వారా నేరుగా పంచాయతీలకు నిధులు వచ్చేలా రాజీవ్‌గాంధీ కృషి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ చాగల్లు మండల శాఖ అధ్యక్షుడు మట్టా సుబ్బారావు, జొన్నకూటి రవికుమార్, ముదునూరి కృష్ణంరాజు పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని చిట్యాలలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆదివారం నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేష్ట సతీష్ , పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మట్టపర్తి రామ్మోహనరావు, కాంగ్రెస్ నాయకులు వేగివాడ నాగేశ్వరరావు, సుంకర సత్యనారాయణ, గన్నిన రామారాయుడు, కొలూరి రతన్‌రాజు, దాసరి కుటుంబరావు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికీ స్థలం.. గృహ నిర్మాణానికి రుణం

బుట్టాయిగూడెం ఇళ్ల పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: ప్రతి పేదవాడికి ఇంటి స్థలాన్ని, గృహ నిర్మాణానికి రుణాన్ని అందిస్తున్నామని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చెప్పారు. మండలంలోని బుట్టాయిగూడెంలో లబ్ధిదారులకు ఆదివారం వైఎస్సార్ జగనన్న ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే తలారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. మొత్తం నారాయణపురం సచివాలయ పరిధిలోని 74 మంది లబ్ధిదారులకు వాటిని అందించారు. కోర్టు వివాదాలను పరిష్కరించి ఇళ్ల పట్టాల పంపిణీకి కృషి చేసిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, బొండాడ వెంకన్నబాబులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడి సొంతింటి కలను జగనన్న నెరవేరుస్తున్నారని, అందుకే ప్రజల మద్దతు ఆయనకు పుష్కలంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకే పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కేతా నాగవెంకట సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ కొప్పిశెట్టి గంగ, ముసలయ్య, నారాయణపురం సర్పంచ్ పెద్దిన దిలీప్, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, స్థానిక పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు పెండ్యాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బుట్టాయిగూడెంలో మహిళలకు ఇళ్ల పట్టాలను అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

రూ.362 కోట్ల పొగాకు విక్రయాలు

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో శనివారం నాటికి రూ.362 కోట్ల విలువైన పొగాకు విక్రయాలు జరిగినట్టు పొగాకు బోర్డు రీజినల్ మేనేజరు ఆదిశేషయ్య తెలిపారు. 18.88 మిలియన్ల పొగాకు విక్రయాలు జరిగినట్టు చెప్పారు. కిలో గరిష్ట ధర రూ.210, కనిష్ట ధర రూ.170. సగటు ధర రూ.197.95 లభించినట్టు తెలిపారు. మరొక 36 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరగవలసి ఉందన్నారు. దేవరపల్లి వేలం కేంద్రంలో 3.50 మిలియన్ల కిలోలు, జంగారెడ్డిగూడెం–1 కేంద్రంలో 4.14 మిలియన్ల కిలోలు, జంగారెడ్డిగూడెం–2 కేంద్రంలో 3.46 మిలియన్ల కిలోలు, కొయ్యలగూడెం వేలం కేంద్రంలో 4.34 మిలియన్ల కిలోలు, గోపాలపురం వేలం కేంద్రంలో 3.42 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగినట్టు వివరించారు. లో గ్రేడు పొగాకు విక్రయాలు పూర్తయినట్టు చెప్పారు.

హృదయాలయ భవన నిర్మాణానికి విరాళాలు



హృదయాలయం నిర్వాహకులు గణేష్, విశాలక్షిలకు రూ.3 లక్షల విరాళాన్ని అందిస్తున్న దాతలు

నిడదవోలు: పట్టణంలోని ఉచిత మానసిక ప్రత్యేక పాఠశాల (హృదయాలయం)లో 15 ఏళ్లగా ఆశ్రయం పొందుతున్న అభాగ్యుల కోసం శాశ్వత భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సత్కార్యానికి దాతల నుంచి విరాళాలు వెల్లువెత్తాయి. కాకినాడకు చెందిన ఇంగ్లిష్ అధ్యాపకులు బిక్కిన పద్మావతి, వీరరాఘవులు దంపతులు రూ.50 వేలు, వారి నానమ్మ మాణిక్యం పేరున రూ.50 వేలు, సోదరి గుణ్ణం కల్యాణ ఆదిలక్ష్మి రూ.లక్ష నగదు, స్వర్గీయ గుణ్ణం వెంటట్రావు, పాపాయమ్మ పేరున రూ.1 లక్ష చొప్పున మొత్తం రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని ఆదివారం హృదయాలయం నిర్వాహకులు దండే గణేష్, విశాలక్షిలకు అందజేశారు. హృదయాలయం భవన నిర్మాణానికి శంకరాపురంలో 40 సెంట్ల భూమి కొనుగోలుకు నిర్వాహకులు దండే గణేష్, విశాలక్షిలు తమ సొంత నిధులు రూ.8 లక్షలు అడ్వాన్సుగా చెల్లించారు.

దళిత సేన కార్యాలయం ప్రారంభం

నల్లజర్ల: దళిత సేన అనే సంస్థ జిల్లా కార్యాలయాన్ని మండలంలోని పోతవరం శివారు కృష్ణాయిగూడెంలో ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జవరపు రవిప్రకాష్ ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాల వారు 50 ఏళ్లకు పైగా సాగు చేసుకుంటున్న ప్రభుత్వ, పోరంబోకు, గ్రామకంఠం, అటవీ భూములపై వారికే సాగు పట్టాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో దళితసేన మండల శాఖ అధ్యక్షుడిగా బొల్లిపాము రమేష్, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ బాజీ నియమితులయ్యారు. కలిదిండి శ్రీను, అనపర్తి రవికుమార్, పింగుల విజయలక్ష్మి, చీలి బాబూజీ, ఏసురత్నం, పెద వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరకు తోటకు నీరందివ్వాలి



వేగేశ్వరపురం శివార్లలో ఎండిపోతున్న చెరకు తోటను చూపుతున్న రైతు పోశియ్య

తాళ్లపూడి: చెరకు తోటలకు నీరు అందడం లేదని వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం శివారు ఆయకట్టు రైతులు వాపోతున్నారు. రబీ వరి కోతల కోసం కొద్దిరోజుల పాటు నీరు సరఫరాను నిలిపి వేయడంతో తన చెరకు తోట కూడా ఎండి పోతోందని గ్రామానికి చెందిన శూలా పోశియ్య తెలిపారు. కాలువ పరిధిలోని బల్లిపాడు, వేగేశ్వరపురాల పిల్ల కాలువలకు నీటిని వదలడం లేదన్నారు. ఎత్తిపోతల పథకం అధ్యక్ష పదవి, నిర్వహణ విషయం కోర్టులో స్టే ఉందని తెలిపారు. దీంతో కోర్టుకు వెళ్లిన రైతుల పై కక్షగా వ్యవహరిస్తున్నారన్నారు. నీరు వచ్చేలా చూడాలని కోరారు.

పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి చేయూత

పిల్లల పేరున బ్యాంకులో రూ.2 లక్షల డిపాజిట్



నగదు డిపాజిట్ బాండ్‌లను చూపుతున్న మృతుడి పిల్లలు

ద్వారకా తిరుమల: కోవిడ్ వంటి క్లిష్ట పరిస్థితుల్లో గ్రామ ప్రజలకు విశిష్ట సేవలందించి, ఇటీవల గుండె పోటుకు గురై మృతి చెందిన ఒక పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి ఆ గ్రామస్తులు చేయూత ఇచ్చారు. వివరాల్లోకి వెళితే, మండలంలోని తక్కెళ్లపాడుకు చెందిన పారిశుధ్య కార్మికుడు మానికల నాగబాబు (35) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. గుణ్ణంపల్లి పంచాయతీ పరిధిలో కొన్నేళ్లుగా నాగబాబు పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందారు. కోవిడ్ సమయంలోనూ తన సేవలను ప్రజలకు అందించారు. అలాంటి నాగబాబు మృతి చెందడంతో పలువురు గ్రామస్తులు అతడి కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. ఈ క్రమంలో దాతలు ముందుకు రావాలని వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టారు. వాటికి స్పందించిన పలువురు దాతలు మృతుడి కుటుంబానికి పలు రకాలుగా సహాయాన్ని అందించారు. దాంతో పాటు సేకరించిన రూ.2 లక్షల నగదును మృతుడి కుమార్తె బాలనాగ సత్య అంజలి పేరున, అలాగే కుమారుడు రిష్యేంద్ర పేరున గుణ్ణంపల్లిలోని సొసైటీలో ఫిక్స్ డ్ డిపాజిట్ చేశారు. వీటిని పిల్లలు మేజర్లు అయిన తరువాత మాత్రమే తీసుకునేలా డిపాజిట్ చేసినట్టు దాతలు తెలిపారు. డిపాజిట్ బాండ్‌లను బాధిత కుటుంబ సభ్యులకు అందించిన వారిలో డీసీఎంఎస్ డైరెక్టర్ జంగా వెంకట కృష్ణారెడ్డి, సొసైటీ ఛైర్‌పర్సన్ ముల్లంగి వెంకట రామిరెడ్డి, నీలకంఠేశ్వరరెడ్డి, గౌతం రెడ్డి, అనూష్‌రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి తదితరులున్నారు.

ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు వద్ద చలివేంద్రం

దేవరపల్లి: ఇక్కడి గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం దేవరపల్లి పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. క్యాంపు కార్యాలయానికి నియోకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వస్తున్న ప్రజల వేసవి దాహాన్ని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ కడిమి వీరకుమారి తెలిపారు. ఎండల తీవ్రత తగ్గేవరకు చలి వేంద్రంలో చల్లని మినరల్ వాటర్ పంపిణీ చేస్తామని తెలిపారు.

ముగిసిన ఊనగట్ల గోగులమ్మ వారి జాతర



ఊనగట్ల గ్రామదేవత గోగులమ్మకు పూజలు

చాగల్లు: మండలంలో ఊనగట్ల గ్రామదేవత గోగులమ్మ వారి జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.12 ఏళ్లకొకసారి వచ్చే ఈ జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు.శనివారం రాత్రి పూరిగుడిసె వద్ద గల అమ్మవారికి బలిచేట నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆదివారం అమ్మవారిని ఆలయం వద్దకు తీసుకు వచ్చి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు.పలువురు ప్రముఖులు, బంధువుల రాకతో గ్రామం సందడిగా మారింది. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా పోలీసులు చర్యలు తీసుకోవడంతో జాతరకు వచ్చిన వారికి చాలా వరకూ ట్రాఫిక్ కష్టాలు తప్పాయి. ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక సిబ్బంది చర్యలు తీసుకున్నారు.



కలవచర్ల గోగులమ్మ

కలవచర్లలో గోగులమ్మ జాతర ప్రారంభం

నిడదవోలు రూరల్: మండలంలోని కలవచర్ల గ్రామదేవత గోగులమ్మ వారి జాతర మహోత్సవాలను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈనెల 22న అమ్మవారి గ్రామ సేవ, 23న బలిచేట, సాంస్కృతిక కార్యక్రమాలు, 24న అమ్మవారికి నైవేద్యాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని కమిటీ సభ్యులు తెలిపారు. గోగులమ్మ జాతరతో గ్రామం బంధువులతో కళకళలాడుతోంది.

ధ్యానంతో ఏకాగ్రత పొందవచ్చు

పెరవలి: విజ్ఞానం అనేది గ్రంథాలయాల్లో మాత్రమే లభిస్తుందని వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రీసోర్స్‌పర్సన్ వి. విజయలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం తీపర్రు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిరమిడ్ మాస్టారు కరుటూరి విశ్వనాథం మాట్లాడుతూ విద్యార్థులు ఆటలతో పాటు ధ్యానం కూడా నేర్చుకుంటే జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. అంతేగాకుండా చదువుపై ఏకాగ్రత పెరిగి ఉన్నత స్థితికి వెళ్ళవచ్చన్నారు. పుస్తక పఠనం ద్వారా సమాజంలో ఏది మంచి ఏది చెడు అనే విషయాలు తెలుస్తాయన్నారు. అలాగే ముక్కామల, పెరవలి గ్రంథాలయాల్లో కూడ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. లైబ్రేరియన్లు ఎం. వెంకటేశ్వర్లు, జయలక్ష్మి, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గెలతో పాటు గెడ కూడా పోయింది

- ఈదురు గాలులతో కూడిన వర్షానికి దెబ్బతిన్న అరటి తోటలు
- 350 ఎకరాల్లోని పంటకు నష్టం
- తడిసిన ధాన్యం, పచ్చి ఇటుకలు



ముక్కామలలో పూర్తిగా విరిగిపోయిన అరటి తోట

పెరవలి: మండలంలో శనివారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షం కురిసింది. దాంతో ముక్కామల, తీపర్రు, ఖండవల్లి అన్నవరప్పాడు, మల్లేశ్వరం గ్రామాల్లో అరటి పంటకు భారీ నష్టం వాటిల్లింది. అరటి చెట్లు నిలువునా విరిగిపోయాయి. రోడ్లపై ఉన్న ధాన్యపు రాశులు మళ్లీ తడిసిపోయాయి. దాంతో రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఇప్పటికే రబీ వరి కోతల సమయంలో ఇబ్బంది పెట్టిన వర్షాలు ఇప్పుడు ధాన్యాన్ని తరలించే సమయంలో తడిసిపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

అపార నష్టం

ప్రచండ వేగంతో వీచిన గాలులకు అరటి తోటలు నిలువునా విరిగి పోయాయి. అరటి బొందలే కాకుండా వాటికి సపోర్టుగా కట్టిన వెదురు గెడలు కూడా విరిగిపోయాయి. గెలతో పాటు గెడ కూడ పోయిందని రైతులు చెబుతున్నారు. మండలంలో దాదాపు 5,500 ఎకరాల్లో అరటి సాగవుతోంది. వాటిలో పక్వానికి వచ్చి, ఈనిన అరటి తోటలు 3000 ఎకరాల్లో ఉన్నాయి. శనివారం నాటి గాలులకు సుమారు 350 ఎకరాల్లోని పంట పూర్తిగా విరిగి పడిపోయింది. ఒక్క ముక్కామలలోనే 150 ఎకరాల్లోని అరటి తోటలు దెబ్బతిన్నాయి. ఈ గ్రామానికి చెందిన రైతు బొబ్బిలి సత్తియ్యకు చెందిన ఐదెకరాల అరటి తోట పూర్తిగా విరిగిపోవడంతో ఆయన కన్నీటి పర్యంతం అవుతున్నాడు.

ఇటుక బట్టీల యజమానులకు నష్టం

ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి ఇటుక బట్టీలకు నష్టం వాటిల్లింది. వేలాది పచ్చి ఇటుకలు తడిసిపోయాయి. మండలంలో 65 ఇటుక బట్టీలు ఉన్నాయి. వాటి నుంచి రోజుకు రెండు లక్షల వరకూ పచ్చి ఇటుకలు తయారవుతాయి. మూడు రోజులుగా తయారైన పచ్చి ఇటుకలు వర్షంలో తడిసి పోవడంతో రూ. లక్షల్లో నష్టం వాటిల్లిందని బట్టీల నిర్వాహకులు చెబుతున్నారు.